నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, బుధవారం 23 ఏప్రిల్ 2025 HYDERABAD

## సత్తా చాటిన బాలికలు

ఫస్టియర్‌లో మేడ్చల్ - మల్కాజిగిరి ప్రథమ స్థానం
రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానం

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో గ్రేటర్ బాలికలు సత్తా చాటారు. రాష్ట్రంలోనే ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో మేడ్చల్–మల్కాజిగిరి ప్రథమ స్థానంలో నిలువగా, రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ సంవత్సరంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలు వరుసగా మూడో స్థానం, రంగారెడ్డి జిల్లా నాల్గో స్థానంలో నిలిచింది. ఈ సారి ఫలితాల్లో మరోమారు హైదరాబాద్ జిల్లా వెనుకబడింది. గ్రేటర్ హైదరాబాద్‌కు 73 శాతం ఉత్తీర్ణత లభించింది. గతేడాది కంటే మూడు శాతం ఉత్తీర్ణత పెరిగింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో కలిపి ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్, వృత్తి విద్యా కోర్సులో కలిపి 73.41 శాతం, ద్వితీయ సంవత్సరంలో 73.39 శాతం ఉత్తీర్ణత లభించింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే ప్రథమ సంవత్సరంలో హైదరాబాద్ లో 66.68 శాతం, రంగారెడ్డి జిల్లాలో 76.36 శాతం, మేడ్చల్–మల్కాజిగిరి 77 .21 శాతం, ద్వితీయ సంవత్సరంలో మేడ్చల్ జిల్లా 77.91 శాతం, రంగారెడ్డి జిల్లా 77.53 శాతం, హైదరాబాద్ 67.74 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

## మంచినీళ్లు ఇవ్వడంలో సర్కార్ ఫెయిల్

బంజారాహిల్స్, ఏప్రిల్ 22: ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో విఫలమైన ప్రభుత్వం పేదల బస్తీలు, కాలనీల్లోకి వెళ్లి నీటి కోసం ఏర్పాటు చేసుకున్న మోటర్లను సీజ్ చేస్తామని బెదిరింపులకు దిగడం సిగ్గుచేటని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్‌నగర్,ఎర్రగడ్డ,యూసుఫ్‌గూడ డివిజన్లకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే మాగంటి కార్యాలయానికి వచ్చి మంచినీటి సమస్యలపై ఫిర్యాదులు చేశారు. విధిలేని పరిస్థితిలో మోటర్ల ద్వారా నీటిని పట్టుకుంటుంటే జలమండలి అధికారులు, కొంతమంది ప్రజాప్రతినిధులు బస్తీల్లోకి వచ్చి వాటిని సీజ్ చేస్తున్నారని మహిళలు వాపోయారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్,దేదీప్యరావు, సంజీవ్, కృష్ణమోహన్, జావెద్, లియాఖత్, కేఎన్.రెడ్డి, అరుణ్, రాకేశ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మాగంటికి వినతి పత్రం అందజేస్తున్న మహిళలు




# గులాబీ జెండా తెలంగాణకు అండ

27న చలో వరంగల్

కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎంతో అభివృద్ధి
రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో రూపొందించిన చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు.

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి లతోపాటు కుత్బుల్లాపూర్ ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులు మంగళవారం నగరంలోని నంది హిల్స్ లోని కేటీఆర్ నివాస కార్యాలయానికి వెళ్లి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు కుత్బుల్లాపూర్ నుంచి భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నియోజక వర్గంలో ప్రతి ఒక్కరూ జెండాలు ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి

## 50 వేల మందితో తరలివెళ్తాం

మేడ్చల్ - మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు

మేడ్చల్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు, ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ సభకు స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు తెలిపారు.

**ప్రశ్న: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా నుంచి సభకు ఎంత మంది తరలివెళ్తారు?**

**బీఆర్‌ఎస్ అధ్యక్షుడు:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి సభకు 50 వేల మందితో తరలివెళ్తాం. ఐదు నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశాలు నిర్వహించి బీఆర్‌ఎస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

**ప్రశ్న: రజతోత్సవ సభపై ప్రజల స్పందన ఎలా ఉంది?**

**బీఆర్‌ఎస్ అధ్యక్షుడు:** బీఆర్‌ఎస్ రజతోత్సవ సభపై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన నాటి నుంచి ప్రజల్లో చర్చ ప్రారంభమైంది. సభను విజయవంతం చేసేందుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా వచ్చేందుకు నిర్ణయం తీసుకుంటున్నారు.

**ప్రశ్న : ఎలాంటి ప్రణాళికలు అమలు చేస్తున్నారు?**

**బీఆర్‌ఎస్ అధ్యక్షుడు:** సభను విజయవంతం చేసేందుకు జిల్లాలోని ఎమ్మెల్యేలు నిర్వహించిన సన్నాహక సమావేశాలతో చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు, నాయకులకు చేసిన దిశా నిర్దేశంతో రజతోత్సవ సభకు రావాలని అందరిని ఆహ్వానించే విధంగా ఇంటింటికీ ఆహ్వాన పత్రికల అందజేత, ర్యాలీలు, వాల్ పోస్టర్ల ఆవిష్కరణ, గోడలపై వాల్ రైటింగ్‌లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

**ప్రశ్న: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు?**

**బీఆర్‌ఎస్ అధ్యక్షుడు:** ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. 16 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విరక్తి చెందుతున్నారు. అన్ని రంగాల వారికి ఎలాంటి న్యాయం జరగక పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది. మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ రావాలనే తెలంగాణలోని ప్రజలందరూ కోరుకుంటున్నారు.



## చరిత్రలో నిలిచిపోయేలా..

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 22 : సమైక్య పాలనలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరిస్తూ గులాబీ జెండా ఎగిరి 25ఏండ్లు పూర్తయ్యాయి. అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సుసాధ్యం చేయడంతో పాటు అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణను ముందుకు తీసుకువెళ్లిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ నగరంగా తీర్చిదిద్దారు. రజతోత్సవ సభకు హైదరాబాద్ జిల్లా నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

### అసాధ్యాన్ని సుసాధ్యం చేసి..


1969నుంచి తెలంగాణ రాష్ట్రసాధన కోసం అనేక పోరాటాలు జరిగిన బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించిన ఉద్యమనేత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన పోరాటం అద్భుతమైనది. నేను 1983నుంచి రాజకీయాల్లో ఉన్నాను. సినీరంగంలో అనేక అద్భుతాలు సాధించిన ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ పార్టీని ఓడించి అధికారంలోకి రావడం ఒక చరిత్ర. అదే విధంగా అనేకమంది హేమాహేమీలు తెలంగాణ రాష్ట్రం కోసం ప్రయత్నించి ఓడిపోయిన పరిస్థితుల్లో తన రాజకీయ జీవితాన్ని ఫణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రసాధన కోసం టీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేయడమే కాకుండా (మిగతా IIవ పేజీలో)

## బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, ఏప్రిల్ 22 : రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు,కార్యకర్తలు తరలి రావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శ్రేణులకు పిలుపు ఇచ్చారు. మంగళవారం ఏఎస్ రావు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ నియోజక వర్గంలోని అన్ని డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేకత వరంగల్ వేదికగా ఎండగట్టాలని అన్నారు. 2 రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గం వ్యాప్తంగా గులాబీ జెండా ఎగురవేయాలని శ్రేణులను కోరారు. 'రేవంత్ రెడ్డి పాలన ఫెయిలయిందని హైడ్రా పేరుతో పేదప్రజల జీవితాలు నాశనం చేసిండు, భూము ల అమ్మకాల పేరుతో మూగజీవాల గోస పోసుకు న్నాడు, మూగ జీవాలు రేవంత్ రెడ్డిని క్షమించవు' అని విమర్శించారు. సమావేశంలో కార్పొరేటర్ లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ ల అధ్యక్షులు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేటీఆర్‌కు రూ. లక్ష చెక్కును అందజేస్తున్న వన్‌స్టాప్ సిస్టమ్ అధినేత సుభాశ్




## బిల్డ్ నౌ మరింత జాప్యం

ఇబ్బందుల్లో దరఖాస్తుదారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగంపై తాటికాయపడినట్లుగా మారింది. సంస్కరణల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు భవన నిర్మాణ రంగంలో మరింత అధ్వానంగా మారుస్తోంది. ఏఐ ఆధారిత వ్యవస్థతో వేగంగా భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సంస్కరణలు చేసిన ప్రభుత్వం.. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయడంలో విఫలమైంది. చకచకా అనుమతులు దేవుడెరుగు కనీసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటే చాలనే పరిస్థితి హెచ్‌ఎండీఏ పరిధిలో నెలకొని ఉంది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతుల ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే వేగంగా పూర్తి చేసేలా టీఎస్ బీపాస్ తీసుకువచ్చి.. సమర్థవంతంగా అమలు చేసింది. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ టీఎస్ బీపాస్ లోపభూయిష్టంగా ఉందని, మరింత పారదర్శకత, వేగవంతమైన అనుమతుల కోసం బిల్డ్ నౌ ప్రారంభిస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో కొత్త విధానం పూర్తి స్థాయిలో సిద్ధం కాకుండానే, పాత విధానాన్ని నిలిపివేయడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### శిక్షణే పూర్తి కాలేదు..

11 జిల్లాలకు విస్తరించిన హెచ్‌ఎండీఏ పరిధిలో ఏప్రిల్ మొదటివారంలోనే బిల్డ్ నౌ అందుబాటులోకి వస్తుందని అధికారులు వెల్లడించారు. కానీ అప్లికేషన్ పనితీరులో వస్తున్న లోపాలను సవరించడానికే సమయం పడుతోంది. దీంతోనే అప్లికేషన్ అందుబాటులోకి రాలేదని, ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలవుతున్నా...ఇందులో వస్తున్న షార్ట్ ఫాల్స్, సెక్యూరిటీ, పనితీరులోని లోపాలను సవరిస్తున్నారు. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో అప్లికేషన్ సిద్ధం కాకుండానే అమలు చేస్తే వచ్చే ఇబ్బందులతో మరిన్ని సమస్యలు వస్తాయని చెబుతున్నారు. దీనిపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఇప్పటివరకు నిర్వహించలేదు. కనీసం సిబ్బందికి పనితీరుకు శిక్షణ శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయలేదు.

## ఉచితంగా అవయవ మార్పిడి

గాంధీలో నోడల్ కేంద్రం ఏర్పాటు
బీఆర్‌ఎస్ హయాంలో పనులకు శ్రీకారం

సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట, ఏప్రిల్22, (నమస్తే తెలంగాణ): పేద రోగులకు ఉచితంగా అవయవ మార్పిడి చేసేందుకు గాంధీ ఆసుపత్రి సిద్ధమవుతుంది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయానికి అవయవ మార్పిడి కేంద్రం జీవం పోయనుంది. కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో నిర్మించిన ఆరు థియేటర్లు నిర్మాణపు పనులు 95శాతం పూర్తయి అతి త్వరలోనే ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. గాంధీ ఆసుపత్రిలో నోడల్ అవయవదాన మార్పిడి కేంద్రాన్ని రూ.35 కోట్లతో నెలకొల్పేందుకు 2022లోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తుల వంటి అవయవ మార్పిడి కోసం రూ.లక్షల్లో అప్పులు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవయవమార్పిడిలు చేయించుకోవడం గమనించిన కేసీఆర్ అవసరమైన ప్రతి పేదోడికి ఉచితంగా అవయవమార్పిడి సేవలందించాలని నిర్ణయించారు. నాటి వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గాంధీ ఆసుపత్రిలోని 8వ అంతస్తులో అవయవమార్పిడి కేంద్రం ప్రారంభించేందుకు వెనువెంటనే రూ.35 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతానికి 95శాతం పనులు పూర్తి కాగా మరో పదిహేను రోజుల్లో గాంధీలోని అవయవమార్పిడి కేంద్రం అందుబాటులోకి రానున్నది.

### అధునాతన పద్ధతిలో ఆరు థియేటర్లు..

అవయవాల మార్పిడికోసం ఆరు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు. ఒకేసారి మూడు వివిధ రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. పీజీ విద్యార్థులకు వైద్యవిద్యలో భాగంగా ఆపరేషన్ థియేటర్‌లో నిర్వహించే అవయవ మార్పిడి చికిత్సను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేశారు. వీటిల్లోనే నేరుగా దాత నుంచి గ్రహీతకు అవయవాన్ని అమర్చనున్నారు.


గాంధీలోని అవయవ మార్పిడి కేంద్రం


ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు లచ్చా నాయక్, తదితరులు

## కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధిచెబుతారు

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మండల కాంగ్రెస్ నాయకులు సభావ త్ లచ్చా నాయక్, పెద్దమ్మ తండా గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సభావత్ సుమన్ నాయక్ తదితరులు సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి బీఆర్‌ఎస్ తోనే ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ 420 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేక పోయిందని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని మరిచి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కన్న తల్లి లాంటి బీఆర్‌ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరి మోసపోయామని లచ్చా నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ నవనిర్మాణ్‌నగర్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

## ప్రభుత్వ స్థలం స్వాధీనం

నవనిర్మాణ్‌నగర్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

నమస్తే ఎఫెక్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 22 : జూబ్లీహిల్స్‌లోని నవనిర్మాణ్‌నగర్‌లో ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాలపై 'నమస్తే తెలంగాణ' పత్రికలో ' ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం' పేరుతో మంగళవారం ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు.షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నెంబర్ 403లోకి వచ్చే జూబ్లీహిల్స్ రోడ్ నెం 1 ప్రధాన రహదారిలోని డీఈ షా సంస్థ భవనం వెనకాల సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలంలో అసాంఘిక శక్తులు తిష్ట వేస్తుండడంతో పాటు అక్రమంగా పార్కింగ్‌లు చేస్తున్నారు. మంగళవారం షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డితో పాటు సిబ్బంది నవ నిర్మాణ్‌నగర్ వెళ్లి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన గదిని కూల్చేయడంతో పాటు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

## క్రిమినల్ కేసులు తప్పవు

సిటీ బ్యూరో : బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని రూ.1200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ పనులు చేపట్టారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం పనులను పరిశీలించారు. శనివారంలోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు డీజీపీఎస్ సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి రూ.35 లక్షలతో జీఐ షీట్స్, ఐరన్ పోల్స్ తో ఫెన్సింగ్ వేస్తున్నారు. ఆక్రమణకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, షేక్‌పేట తహసీల్దార్ అనిత రెడ్డి, డీఈ సంజీవ్, ఏఈ శ్రీధర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఫెన్సింగ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి